# సింగిల్ పేజీ కథలు

## మాతృత్వం



''ఎలా వుంది వసూ నీకు?'' ఆఫీసు నుంచి రాగానే భార్యని ప్రేమగా అడిగాడు రవి.

''నీరసంగా వుందండీ. వాంతులు కూడా ఎక్కువగా వున్నాయి'' చెప్పింది వాసంతి.

''ఎవరికైనా ఇలాంటి సమయంలో సహజమేగా? కష్టపడకపోతే పిల్లలు వస్తారా?'' నవ్వుతూ అంది శాంతమ్మ.

రవికి, వాసంతికి వివాహమై సంవత్సరం అయింది. ప్రముఖ వ్యాపారవేత్త, కోటీశ్వరుడి గారాలపట్టి, ఏకైక కుమార్తె వాసంతి.

''వసూ! కొంచెం జ్యూస్ తీసుకుంటావా?''

''ఏమిటోనండీ! ఈ బాధలన్నీ పగవారికి కూడా వద్దు బాబోయ్. హాయిగా కాలేజీకి వెళ్తూ, ఫ్రెండ్స్‌తో నవ్వుతూ తిరిగే నేను ఇవన్నీ భరించాలంటే వళ్ళంతా నొప్పులు. కళ్ళు తిరుగుతున్నాయి. మధ్యమధ్యలో డాక్టర్ పరీక్షలు. నావల్ల కాదు బాబూ!''

''కొన్నాళ్ళు ఓపిక పట్టు వసూ. మనకి బాబు కావాలికదా. బాబు కోసం'' శాంతంగా అన్నాడు రవి.

''సరే! మీ కోసం భరిస్తాను. మరి డెలివరీ అయిన వెంటనే నాకు మాట ఇచ్చినట్లు ఆపరేషన్ చేయిస్తారుగా?''

''అలాగే! మనకి ఒక్క బాబు చాలు. నీకు ఇంక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయిస్తాను'' మాట ఇచ్చాడు రవి.

★★★

వాసంతి నెలలు నిండిన తరువాత పండంటి బాబును ప్రసవించింది.

''వాసంతీ! ఆపరేషన్ విషయం డాక్టర్‌గారితో మాట్లాడనా?'' లాలనగా అన్నాడు రవి.

''వద్దండీ!'' సిగ్గుపడుతూ అంటున్న భార్యని చూస్తూ ''ఎందుకు?'' అని అడిగాడు.

''మరీ...మరీ మనకి ఒక పాప కావద్దూ! పాప పుట్టిన తరువాత ఆపరేషన్ చేయించుకుంటాను'' మురిపెంగా బాబును చూసుకుంటూ అన్నది వాసంతి.

ఆమె ముఖంలో ప్రపంచాన్ని జయించినంత ఆనందం, సంతృప్తి. బాధ, వేదన ఎటు మాయమయ్యాయో తెలియదు. మాతృత్వంలో మధురిమ, మహత్యం అంటే ఇదే కాబోలు.

''అలాగే నీ ఇష్టం'' చిరునవ్వుతో అన్నాడు రవి.


-పి.పద్మజ

వైఫాఫ్ పి.విజయకుమార్

'అయోధ్య', ఎమ్.బి.ఎస్.ఎల్

స్కూలు ఎదురుగా,

గాంధీనగర్, బళ్ళారి.


## కిరీటం

సౌండ్ యంత్రం అరుదాటిన తరువాత ఆనందరావు చేతిలో మల్లెల ఘుమఘుమలతో ఇంట్లోకి ఆనందంగా అడుగుపెట్టాడు.

టీవీ ఎదురుగా కుర్చీలో కూర్చుని కన్నీరు కారుస్తోంది అతని భార్య సూర్యకాంతి.

''నిన్ను దిక్కుమాలిన ఆ టీవీ చూడద్దన్నానా? 'అత్తలూ-ఆరళ్ళు', 'కోడళ్ళూ-కడగండ్లు' అంటూ ఛీ...ఛీ... పిచ్చి సీరియల్స్. ఈ ఆడవాళ్ళ కన్నీళ్ళు పట్టి ప్రిజర్వ్ చేసే సదుపాయం వుంటే దేశంలో నీటి కొరత వుండేది కాదు కదా!''

''అది కాదండీ...ఇటు చూడండి'' సూర్యకాంతి ఆ టీవీ వైపు చూపించింది.

స్క్రీన్‌మీద మొహమంతా పళ్ళతో, ఒళ్ళంతా ఊపుతూ పాట పాడుతోంది పదో నెంబర్ వీధిలో ఉండే పరిమళ.

ఆనందరావుకి విషయం అర్థమయ్యింది. పరిమళ, సూర్యకాంతి ఇద్దరూ గాంధీనగర్ లేడీస్ క్లబ్ మెంబర్స్. ఈమధ్య ఆ టీవీ వాళ్ళు జిల్లాలలో జరిగిన కొన్ని ముఖ్యఘట్టాలు, సంఘటనలూ రికార్డు చేసి వేస్తున్నారు. అందులో భాగమే ఇది.

అంతా సవ్యంగా జరిగి వుంటే పరిమళ స్థానంలో సూర్యకాంతి పాట పాడుతూ వుండేది.



''పోస్లేవోయ్! మీ ప్రెసిడెంట్ నిన్ను మునగచెట్టు ఎక్కించింది సంతోషించు'' ఆనందరావు నవ్వుతూ అన్నాడు.

సూర్యకాంతికి దాదాపు రెండునెలల క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

★★★

''సూర్యకాంతిగారి ఇల్లిదేనా?'' ఒకరోజు మధ్యాహ్నం రమారమి మూడుగంటల ప్రాంతంలో ఇద్దరు ఆడవాళ్ళు తమ ఇంటికి వచ్చారు.

వాళ్ళని లోపలికి రమ్మనమని కూర్చోబెట్టింది. సూర్యకాంతికి వాళ్ళెవరో ఎందుకొచ్చారో అర్థం కాలేదు. తెల్సినవాళ్ళు కాదు.

''మీరు...?''

''మేము జయనగర్ మహిళామండలి నుంచి వచ్చాం. రేపు మా మహిళామండలి పాటల పోటీలు జరుగుతున్నాయి. మీరు బాగా పాడతారని, సంగీత జ్ఞానం వుందని మీ ప్రెసిడెంట్‌గారు చెప్పారు. అందుకని మిమ్మల్ని జడ్జిగా పిలుద్దామని వచ్చాం'' ఒకావిడ చెప్పింది.

''గరల్స్ స్కూల్ మ్యూజిక్ టీచర్ని కూడా పిలిచాం'' ఆవిడ చెప్పుకుపోతోంది.

సూర్యకాంతి తన మొహంలో ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కన్పించనీయకుండా కాస్త తంటా పడాల్సి వచ్చింది.

తమ క్లబ్బులో చాలామంది పాడేవాళ్ళున్నా అందరి